మొయినాబాద్ : శ్రీరాంనగర్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసిన ఎంపీటీసీ రాంరెడ్డి

షాబాద్ : రేగడిదోస్వాడ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు అందజేసిన దాత శ్రీనివాస్, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

# ప్రభుత్వ పాఠశాలతోనే ఉజ్వల భవిష్యత్తు

**విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేసిన అధికారులు, ఉపాధ్యాయులు**

చేవెళ్లరూరల్ : కందవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర తదితరులు

మొయినాబాద్, జూన్13 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీటీసీ పట్నం రాంరెడ్డి అన్నారు. మండల పరిషత్ శ్రీరాంనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు. ఉచిత పాఠ్య పుస్తకాలు ఇవ్వడంతో పాటు రెండు జతల ఏక రూప దుస్తులు కూడా ఇస్తారని తెలిపారు. ప్రతి ఏడాది విద్యార్థులకు యూనిఫాం ప్రభుత్వం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్, రవి, ఉమాదేవి, చైర్మన్ వినోద్ పాల్గొన్నారు.

### సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

**చేవెళ్ల రూరల్ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కందవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర బోగం, కౌకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల జడ్పీహెచ్ఎస్, కందవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యునిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలతో ఉత్తమ బోధన కల్పిస్తున్నట్లు, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రెండు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ కమిటీ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### దాతల సహకారం ఎంతో అవసరం

**షాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు దాతల సహకారం ఎంతో అవసరమని రేగడిదోస్వాడ ప్రత్యేకాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండలం రేగడిదోస్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీనివాస్ ఉచితంగా నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం సంతోషకరమన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పార్వతమ్మ, మాజీ సర్పంచ్ రాములు, ఉపాధ్యాయుడు అంజయ్య, నాయకులు రాంచంద్రయ్య, జంగయ్య, రాజారత్నం, శేఖర్ ఉన్నారు.

# విద్యావ్యవస్థపై నిర్లక్ష్యం ఎందుకు..?

- తరగతులు జరుగుతున్న సమయంలో పనులు ఎలా చేస్తారు
- ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ కరువు
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం పదిసార్లు చెప్పినా పట్టించుకోని వైనం
- పదవీ కాలం పూర్తయినా పనులు చేయని అధికారులు
- అధికారుల పనితీరుపై చివరి సర్వసభ్య సమావేశంలో సభ్యులు అసంతృప్తి
- ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం

రెడ్డిపల్లి ఎంపీటీసీతో విద్యుత్ ఏఈ రాజేశ్‌బాబు వాగ్వాదం

మొయినాబాద్‌లో ఎంపీపీ నక్షత్రం అధ్యక్షతన జరుగుతున్న సర్వసభ్య సమావేశం

మొయినాబాద్, జూన్ 13 : మండల సర్వ సభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు గునుగుర్తి నక్షత్రం అధ్యక్షతన మొయినాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలో 22 అంశాలకు సంబంధించిన అజెండాను ప్రవేశపెట్టారు. చివరి సమావేశం కావడంతో అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు తాము చేసిన పనులకు సంబంధించిన వివరాలను సభలో వెల్లడించారు. ముందుగా వ్యవసాయ శాఖకు సంబంధించిన అంశం చర్చకు రాగా వ్యవసాయాధికారి రాగమ్మ శాఖ తరపున చేపడుతున్న సేవల గురించి సభ్యులకు వివరించారు. విద్యా శాఖకు సంబంధించిన సేవల గురించి ఎంఈవో వెంకటయ్య వివరించారు. మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని అమ్మ ఆదర్శ పాఠశాలలుగా మార్చి పాఠశాలలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులు ఎంత వరకు వచ్చాయని రెడ్డిపల్లి ఎంపీటీసీ శ్రీనివాస్ ప్రశ్నించారు. తరగతుల్లో విద్యా బోధన జరుగుతున్న సమయంలో పనులు చేస్తుంటే వారి చదువులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. మండలంలో ప్రైవేట్ పాఠశాలను అనుమతులు లేకుండా ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేస్తున్నా విద్యా శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ఎంపీటీసీలు శ్రీనివాస్, రాంరెడ్డి, మల్లేశ్ ఆయనను నిలదీశారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం పదిసార్లు చెప్పినా విద్యుత్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని.. పదవీ కాలం ముగిసినా పనులు మాత్రం కాలేదని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. రెడ్డిపల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చి నెలలు గడుస్తున్నా ఎందుకు బిగించడం లేదని రెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ ఏఈ రాజేష్‌బాబును నిలదీశారు. చిన్నమంగళారంలో ఓ రైతు పొలంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని చెప్పినా ఏఈ పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్ అన్నారు.

మొయినాబాద్ నుంచి సురంగల్ వరకు వేసిన రోడ్డు అసంపూర్తిగా ఉందని, రోడ్డు సైడ్‌లో మట్టి కొట్టుకుపోయి బీటీ రోడ్డు పగిలిపోతున్నదని శ్రీరాంనగర్ ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి అన్నారు. రోడ్డుపై సెకండ్ లేయర్ ఏమైనా వేసేది ఉందా అని పీఆర్ ఏఈ రమ్యను ప్రశ్నించారు. మొయినాబాద్ నుంచి చందానగర్ గేట్ వరకు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారిందని.. కనీసం గుంతల్లో మొరమైనా పోయాలని ఏఈ రమ్యకు రెడ్డిపల్లి ఎంపీటీసీ శ్రీనివాస్ సూచించారు.

### ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇస్తా

**– చంద్రమౌళి, మిషన్ భగీరథ సీఈ**

ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇస్తాం. నల్లా కనెక్షన్ ఇవ్వడానికే పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నామన్నారు. వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నామన్నారు. 25 శాతం మంది ప్రజలు నీళ్లు సరిగ్గా రావడం లేదని చెబుతున్నారన్నారు. అందరికీ నీళ్లు వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 57 లక్షల మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌లు ఉన్నాయని చెప్పారు. విద్యా సంస్థలకు కాని, ఫంక్షన్ హాల్స్‌కు కాని, వ్యవసాయ క్షేత్రాలకు గాని నీళ్లు తీసుకోవాలంటే వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలన్నారు. వారికి అవసరమైన నీళ్లకు ప్రభుత్వం చార్జి వేస్తుందని సీఈ పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో సంధ్య, ఏపీ రాగమ్మ, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈవో వెంకటయ్య, సూపరిటెండెంట్ సులోచన, ఏపీఎం రవీందర్, విద్యుత్ ఏఈ రాజేశ్‌బాబు, పీఆర్ ఏఈ రమ్య, ఏఈ లక్ష్మి, ఎంపీటీసీలు అర్చన, అంజయ్య, పద్మమ్మ, లత, అర్జున్ పాల్గొన్నారు.

కార్యకర్త సురేందర్‌రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

## ఆపదలో ఉన్న ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తను ఆదుకుంటాం

**షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి**

షాబాద్, జూన్ 13 : ఆపదలో ఉన్న ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అంతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఈగ సురేందర్‌రెడ్డి కుటుంబానికి గురువారం షాబాద్‌లో జడ్పీటీసీ తన వంతుగా రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో కీలకంగా పనిచేసిన సురేందర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పార్టీకి తీరని లోటని చెప్పారు. వారి కుటుంబానికి పార్టీ తరపున రూ.2లక్షల బీమా డబ్బులు అందజేసినట్లు తెలిపారు. అంత కుముందు సొంతంగా రూ.50వేలు కూడా అందించినట్లు చెప్పారు. గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో మంది పార్టీ కార్యకర్తలకు పార్టీతోపాటు తనవంతుగా సహాయం అందించినట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు ఎవరు కూడా ఆధైర్యపడవద్దని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీరాం రెడ్డి, మాజీ సర్పంచ్ జంగయ్య ఉన్నారు.

# ప్రభుత్వ బడుల్లోనే చదివించాలి

- ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి
- మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు నెలకు రూ.25 వేలు ప్రకటించిన ఎంపీపీ

కొత్తూరు, జూన్ 13 : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని గూడూరు ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా గ్రామ పెద్దలు, యువత విద్యార్థులను గవర్నమెంట్ స్కూళ్లలో చేర్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్కూళ్లలో తెలుగు మీడియంతో పాటు ఇంగ్లీషు మీడియం కూడా అందుబాటులో ఉందన్నారు. అంతేకాకుండా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యనందిస్తారని చెప్పారు. అందువల్ల నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ విషయాలన్నీ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలుపాలని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువతకు ఎంపీపీ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల నెలవారీ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీపీ దృష్టికి తేవడంతో ఆయన మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రతి నెలా రూ.25 వేలు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఈ డబ్బును ప్రతి నెలా 5వ తేదీలోపు ఇస్తానని చెప్పారు. మధ్యాహ్నం భోజన వండేవారు, స్కావెంజర్లు తదితర వాటికి ఉపయోగించుకోవాలని సూచించారు. అంతకుముందు ఎంపీపీ మల్లాపూర్, మక్తగూడ, పెద్దగుట్టతండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణారెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో విజయలక్ష్మి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పద్మారావు, మాజీ సర్పంచ్‌లు రామ్‌దాస్‌నాయక్, రవినాయక్, రాజు, మాజీ ఉపసర్పంచ్ దయానంద్‌గుప్తా, దర్శన్, నరేందర్, రాజుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ దశరథ్‌నాయక్, సిద్ధూగౌడ్, శ్రీరాములు, మల్లేశ్, పాండు, మల్లేశ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

యాచారం : అంగన్‌వాడీ సిబ్బందికి మెడికల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సుకన్య తదితరులు

యాచారం, జూన్ 13 : అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు ఎంపీపీ సుకన్య అన్నారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యూనిఫాం, చిన్నారులకు మెడికల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పౌష్టికాహారాన్ని, శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటునందించాలన్నారు. మెడికల్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ, సూపర్‌వైజర్ తులసి, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

### మెడికల్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

**మంచాల :** అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన మెడికల్ కిట్లను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నర్మద, జడ్పీటీసీ నిత్య అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మెడికల్ కిట్లు, చీరలను వారు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నారుల పట్ల అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలను వెంటనే అధికారులు తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో శాంతిశ్రీ, సూపర్‌వైజర్లు జంగమ్మ, యాదమ్మ ఉన్నారు.

మంచాల : అంగన్‌వాడీ టీచర్లకు మెడికల్ కిట్లను అందజేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

## దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 13 : దివ్యాంగులు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రేఖ అన్నారు. హైదరాబాద్-2 ఆర్టీసీ డిపో నుంచి దివ్యాంగులకు మంజూరు చేసిన ఉచిత బస్‌పాస్‌లను అబ్దుల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఎంపీపీ జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్, ఎంపీడీవో శ్రీవాణితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులు ఇంతకుముందు ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్ల వద్ద క్యూలో ఉండి బస్‌పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకునేవారన్నారు. వారం రెండు వారాల తర్వాత వారికి బస్‌పాస్‌లు అందేటివన్నారు. ప్రస్తుతం దివ్యాంగులకు దూర భారం లేకుండా తమ గ్రామాలకే వచ్చి బస్‌పాస్‌లు ఇవ్వడం సంతోషకరమన్నారు. దివ్యాంగులు తమ బస్‌పాస్‌లను జాగ్రత్తగా భద్రపరుచుకొని వినియోగించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు గౌస్‌పాషా, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, నాయకుడు మహేందర్‌గౌడ్ ఉన్నారు.



దివ్యాంగులకు బస్‌పాస్‌లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేఖ తదితరులు

ఆదిబట్ల : బొంగుళూరు నుంచి ఆదిబట్ల వైపు వెళ్లే మార్గంలో నిలిచిన వర్షపు నీరు

## దంచికొట్టిన వాన

- చెరువులను తలపించిన రోడ్లు
- ఇబ్బందులుపడ్డ ప్రయాణికులు

ఆదిబట్ల, జూన్ 13 : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెరువులను తలపించాయి. ఆదిబట్ల టీసీఎస్ ఎదుట రోడ్డుపై వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. రోడ్లకు ఇరువైపులా అక్రమంగా కట్టడాలు నిర్మించడంతో రోడ్లపై నీళ్లు నిలుస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కుంటల్లోకి వర్షపునీరు చేరింది.

### కాలనీలు జలమయం

తుర్కయాంజాల్ : మున్సిపాలిటీ పరిధిలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు అంతా కాలనీల్లో నిలుస్తుందని కాలనీలవాసులు వాపోతున్నారు.

తుర్కయాంజాల్ : బ్రాహ్మణపల్లి చౌరస్తాలో రోడ్డుపైకి చేరిన నీరు

## గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

పట్టుబడిన నాటుసారా తయారీదారులతో సీఐ బద్యానాథ్‌చౌహాన్

కడ్తాల్, జూన్ 13 : గుడుంబా తయారు చేసినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల మండలాల్లోని నాటుసారా తయారీ స్థావరాలపై గురువారం ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. ఆయా మండలాల్లోని కుభ్యాతండా, దుబ్బతండా, బావోజ్ తండా, పలుగుతండా, చెట్లగుట్టతండా, చౌటగుట్టతండా, మన్యేతండాల్లో దాడులు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో 3 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని పేర్కొన్నారు. దాడుల్లో నాలుగు కేసులు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన సారా తయారీదారులను తలకొండపల్లి, కడ్తాల్ తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన వివరించారు.

## బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా బీరప్ప

యాచారం, జూన్ 13 : బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన గొరిగె బీరప్పను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గొరిగె బీరప్ప మాట్లాడుతూ.. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్లు ఆయన తెలిపారు.

## విగ్రహం జోలికొస్తే ఊరుకోం

**తెలంగాణ ఉద్యమకారుడు మన్నె నారాయణ**

షాద్‌నగర్, జూన్ 13 : షాద్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న ప్రొఫెసర్ జయశంకర్‌సార్ విగ్రహాన్ని తొలగించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు జేపీసీ నాయకులు వివాదాలను సృష్టిస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుడు మన్నె నారాయణ గురువారం మండప డ్డారు. ప్రొఫెసర్ జయశంకర్‌సార్ విగ్రహాన్ని 2014లో ఏర్పాటు చేశారని, ఉద్యమ ఆనవాళ్లను చెరిపేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విగ్రహం జోలికొస్తే ఉద్యమకారులు ఊరుకోరని హెచ్చరించారు. సార్ విగ్రహాన్ని తొలగించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి మీరెవ్వరు అని ప్రశ్నించారు. ఏ ఉద్యమం కోసం జేఏసీ తాపత్రయపడుతుందో అర్థం కావడం లేదన్నారు. ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించుకోవాలని, పాత విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేస్తే సహించబోమని పేర్కొన్నారు. మీరు కొత్త విగ్రహం పెట్టుకోవాలంటే మరో చోట పెట్టుకోవాలి తప్ప పాత విగ్రహాన్ని తొలగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఉన్న షాద్‌నగర్‌లో రాజకీయ చిచ్చు పెట్టొద్దని ఆయన హితవు పలికారు.

## టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

చేవెళ్లటౌన్, జూన్ 13 : చేవెళ్లలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో 5 (పీజీటీ) గంటల ప్రాతిపదిక టీచర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టేనావతి తెలిపారు. తెలుగు 2, హిందీ 1, ఫిజిక్స్ 1, జువాలజీ 1 పోస్టులున్నాయని.. అభ్యర్థులు ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, అనుభవం లాంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని మెరిట్ అభ్యర్థులను ఈ పోస్టులకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 15లోపు ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

## దశ దిన కర్మకు వెళ్తూ తిరిగిరాని లోకాలకు..

పెద్దఅంబర్‌పేట, జూన్ 13 : దూరపు బంధువుల ఇంట్లో దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ ఓ వ్యక్తి మృత్యువాతపడ్డ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలోని బ్యాంక్ కాలనీకి చెందిన మార్ల యాదయ్య (57) రాళ్ల కొడుతూ జీవిస్తున్నాడు. ఆయనతో కలిసి పనిచేసే దూరపు బంధువుల ఇంట్లో దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు అబ్దుల్లాపూర్‌మెట్‌కు వచ్చాడు. అబ్దుల్లాపూర్‌మెట్ హెచ్‌పీ పెట్రోల్ బంకు పక్కన ఉన్న ఇషా గ్రీన్ వ్యాలీ వెంచర్ ఎదురుగా హైవేపై రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. యాదయ్య తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు యాదయ్యను వెంటనే ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ యాదయ్య మృతిచెందాడు.

రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కొత్తకుర్మ సత్తయ్యను గురువారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి చెందిన కుర్మ సంఘం నేతలు ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. – తుర్కయాంజాల్, జూన్ 13



అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన తాటిపల్లి యాదయ్యగౌడ్ (బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు) 2023లో మరణించగా సంఘం తరపున రూ.25వేల ఆర్థిక సాయాన్ని యాదయ్య భార్య పద్మకు అందజేస్తున్న వైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌యాదవ్ – అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 13



ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ ఉన్నత పాఠశాలలో గత 9 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన రాధికకు గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు తెలిపారు. రాధిక పదోన్నతిపై నల్గొండ జిల్లా ఉరవకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. – షాద్‌నగర్‌రూరల్, జూన్ 13

## భవన నిర్మాణ కార్మికులు ఏకం కావాలి

**సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపు**

ఆదిబట్ల, జూన్ 13 : భవన నిర్మాణ కార్మికులు ఏకమై తమ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసినప్పుడే మన హక్కులు మనకు వస్తాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. గత మూడు రోజులుగా ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలోని ముదిరాజ్ భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ అనుబంధ సంస్థ భవన నిర్మాణ కార్మికుల శిక్షణా తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా భూపాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. హక్కులు సాధించుకోవాలంటే ప్రతిఒక్కరూ ఐక్యతగా ఉండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కార్మికులకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆదిబట్ల మున్సిపాలిటీ కన్వీనర్ నర్సింహ, నాయకులు బాల్‌రాజ్, యాదయ్య, జంగయ్య, మధు, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలు ఇచ్చేవరకు పోరాటం

**సీపీఐ జాతీయ నాయకుడు పల్లా వెంకట్‌రెడ్డి**

పెద్దఅంబర్‌పేట, జూన్ 13 : ప్రతి పేదవాడి గొంతుక సీపీఐ అని, భూమి లేని పేదలకు ఇంటి స్థ